# వెంకయ్య దీపావళి

(కథానిక)

"రేపు దీపావళి" అంది భార్య.

"ఔను" అన్నాడు వెంకయ్య ఏదో ఆలోచిస్తూ.

"రేపటికి ఇంట్లో ఏమీ లేదు...బియ్యం పప్పులు, అన్నీ నిండుకున్నాయి."

"నాదగ్గర డబ్బు కూడా నిండుకుంది" అన్నాడు వెంకయ్య, ఇంకా ఆలోచిస్తూనే.

"ఎక్కడో అప్పు చేసయినా సామాను తేవకపోతే పస్తులే!"

వెంకయ్య గట్టిగా నవ్వుతూ "ఓసి వెర్రి దానా! అప్పు తీర్చలేని నీకూ నాకూ అప్పు ఎవడిస్తాడు చెప్పు!" అన్నాడు.

"అయితే ఏమిటి చెయ్యడం?"

"నువ్వే చెప్పేవు—పస్తుండడం!"

"మీకంతా నవ్వులాటగా వుంది. పిల్లలు పటాకీలు కావాలని ఏడుస్తున్నారు."

"భేష్! బియ్యం, పప్పులు ముఖ్యమా, పటాకీలు ముఖ్యమా చెప్పు?"

"నేను మీతో మరి మాట్లాడలేను" అని భార్య తుర్రున వంటింట్లోకి పారిపోయింది.

వెంకయ్య మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ఇలా ఆలోచించడం అతనికి కొత్త కాదు. ఇరవై ఏళ్ళనుంచీ అతడు ఈవిధంగా ఆలోచిస్తూ కూచోడం పరిపాటయిపోయింది. అయినా, ఈ ఆలోచనలకు అంతు కనిపించడంలేదు. డబ్బు! డబ్బు ఎలా వస్తుందనే అతడు ఆలోచిస్తున్నాడు. అతనే కాదు. వెంకయ్యలాంటి వాళ్లు ఈ ప్రపంచంలో చాలామంది ఈ విధంగానే ఆలోచిస్తూ వుంటారు. ఆ ఆలోచన ఎప్పుడూ పూర్తి కాదు. అయినప్పటికీ, రోజులు యెలాగో ఒకలాగున గడిచిపోతూనే వుంటవి. "డబ్బు లేకపోతేనేం?" అనుకున్నాడు వెంకయ్య. "డబ్బు లేకపోతే, తిండి యెలాగు?" అని, తనకు తనే ప్రశ్నరూపంలో జవాబు చెప్పుకున్నాడు. "ఐతే తిండి ఎందుకూ?" అనుకున్నాడు మళ్ళీ! "తిండి లేకపోతే చచ్చిపోతాం!" అని, వెంటనే అనుకున్నాడు. అంతే. "చచ్చిపోతేనేం!" అని అనుకునే ధైర్యం వెంకయ్యకి లేదు. ఎందుకంటే ఆ చావు దగ్గిరే మానవులందరికీ ఒకరకమైన వింతభయాన్ని కల్పించాడు దేముడు. ఇప్పుడు తెలిసింది వెంకయ్యకి—డబ్బుకీ, ప్రాణానికీ అతి సన్నిహిత సంబంధం వుందని. అంటే, డబ్బు లేకపోతే బ్రతకలేమన్న మాట.

నిజానికి వెంకయ్య మన్నాడు బియ్యంకోసం డబ్బు సంపాదించడానికి అన్నివిధాలా (ఒక్క దొంగతనం తప్పించి) ప్రయత్నించి, విఫలుడయాడు. తన కోమటి గుమస్తా వుద్యోగంవల్ల లభించే 30 రూపాయలూ ఏనాడో ఐపోయేయి. ఇంక రేపటినుంచి వచ్చే నెలదాకా మళ్ళీ జీవితంతో యుద్ధం ప్రారంభించాలి. రేపు దీపావళిట. అంటే డబ్బును బాణసంచా రూపంలో కాల్చ గలిగే వాళ్ళు కాల్చే రోజన్న మాట. బాణ సంచా కాలుస్తే ఆనందము, భక్తి, ముక్తి లభిస్తాయట! అయితే తనకిముక్తి లేదన్నమాట!

"నాన్నా" అని గట్టిగా అరుస్తూ తన అయిదేళ్ళ కూతురు వచ్చింది. వచ్చి అతని ఒళ్ళోకి ఎక్కి కూచుని, "నాన్నా నాకు టపాకీలు తేవూ" అంది. ఇంతలో ఎనిమిదేళ్ళ కొడుకొచ్చి "నాన్నా! నాకు పటాకీలు తేవూ" అని చెయ్యి పట్టుకు లాగడం ప్రారంభించేడు. "వెధవల్లారా! చస్తూవుంటే పటాకీలేమిటి?" అని వెంకయ్య గట్టిగా కసిరేడు. "లేదు ఎవరూ చావలేదు, పటాకీలుమాత్రం కొను" అని పిల్లలు గోల్లుపెట్టడం మొదలెట్టారు. వెంకయ్య స్థితి ఎలా వుందంటే: అవతల తన ఆలోచనా తెమల్లేదు; ఇవతల ఈ వెధవలిద్దరూ వేధిస్తున్నారు.

"పటాకీలూ లేవు, ఏమీ లేవు. కావలిస్తే చేతులు కాల్చుకొండి పొండి" అన్నాడు విసుగ్గా.

వజ్ఝల రామనరసింహామ్

"అమ్మో! చేతులు కాలిపోవూ? మాకు పటాకీలే కావాలి" అన్నారు ఇద్దరూను.

"వెధవ గోల మీరూను, వెళ్తారా లేదా" అని ఒక్కమారు విదిలించుకొన్నాడు. వళ్లోంచి పిల్ల కిందపడి పోయింది. కొడుకు బుర్ర గోడకి ఢీకొంది. ఇద్దరూ గొల్లుపెట్టి ఏడ్వ నారంభించేరు. ఇంతలో భార్య వచ్చి "అబ్బబ్బ! ఏం ఏడిపిస్తారండీ" అంది. వాళ్లు మరింత ఏడుపు ఎక్కువచేశారు. "నోరు మూస్తావా? కొట్టమంటావా?" అని ఇద్దరినీ దబదబా బాది వేయడం మొదలెట్టేడు. భార్య వచ్చి "రామ రామ! గొడ్డుని బాదినట్లు బాదేస్తారేమండీ" అంటూ అడ్డుపడింది. కాని అతని బలానికి ఆగలేక పక్కకి దెబ్బన తోసివేయ బడింది. ముడివేసుకున్న జుట్టు విడిపోయి నేలంతా చెదిరిపడింది. సరిగ్గా సరిపడని పైట తొలగిపోయి పక్కనున్న పెట్టెకి తగిలి చర్రుమని చిరిగిపోయింది. నేలమీద తల రక్కున మోసింది. "ఇక చావండి! వెధవలు" అంటూ నుదుటి చెమటను తుడుచుకొంటూ, వెంకయ్య గబగబా వీధిలోకి వెళ్ళిపోయాడు.

సాయంకాలం ఆరు అయింది. వెంకయ్య భార్య పొరుగింటికి వెళ్ళి, పిల్లలేడుస్తున్నారని చెప్పి కొంచం చిచింద్రీ మందూ, కాగితం గొట్టాలు, అడిగి తెచ్చింది. పిల్లలిద్దరూ అది చూసి ఆనందంతో గొల్లుమన్నారు.

"ష్! వూరుకొండమ్మా! మామ్మగారు మందిచ్చారు. మీకు చిచింద్రీలు కడతాను లెండి. బుద్ధిగా కూచోండి. నాన్నగారికి చెప్పకండేం? చెపితే మన్నందరినీ తిడతారు..." అందామె.

"చెప్పమే, చెప్పమే నాన్నకి" అన్నారు ఇద్దరూ.

వెంకయ్య ఇంకా యింటికి రాలేదు. చీకటి పడిపోయింది. వెంకయ్య భార్య, పిల్లలిద్దరు, కొట్లో ఓమూల కూచొని, సన్న దీపపు వెల్తురులో చిచింద్రీలు, దట్టిస్తున్నారు. పిల్లలు ఆత్రుతతో, ఎప్పుడు చిచింద్రీలు తయారవుతాయా అని కూచొని చూస్తున్నారు.

"అమ్మా వేగిరం దట్టించే. వీధిలో అందరూ కాల్చడం మొదలుపెట్టేశారే" అన్నాడు కొడుకు.

"అమ్మా! నాన్నతో నేను చెప్పనులే" అంది కూతురు.

"ఉండు తల్లీ! అయిపోవచ్చింది మరి" అంది ఆమె.

ఇంతలో తలుపు కొట్టిన చప్పుడయింది.

"ఒరే నాన్న వచ్చేశారు. వెళ్ళు తలుపు తియ్యి" అని కొడుకుని పంపించి, తను గబగబా అన్నీ యెత్తి బెట్టి దాచబోయింది. ఆ తొందరలో దీపం పక్కకి పడిపోయింది. కాగితంలోవున్న చిచింద్రీ మందు అంటుకుని భగ్గున మండింది. కూతురి ముఖమంతా కాలిపోయింది. తన చేతులు కాలిపోయేయి. పిల్ల పెద్ద కేకవేసి, సొమ్మసిల్లి పడిపోయింది. "అయ్యో, చిట్టి తల్లీ! నీకళ్లు పోయాయే" అని ఏడుస్తూ పిల్లను తీసింది. "ఏమిటయింది? ఏమిటయింది" అంటూ వెంకయ్య వచ్చాడు.

"అయ్యో! పిల్లకళ్ళు కాలిపోయాయండీ... పిల్లసొమ్మసిల్లి పోయింది. దేముడా ఇంకేం గతి" అని ఆమె తల మొత్తుకుంటూవుంది. చిచింద్రీ మందు ఇంకా కాలుతూనే వుంది. ఒక్క క్షణంలో వెంకయ్యకి అంతా అర్థం అయింది. ఆ క్షణంలో అతనికి వెర్రి ఆవేశం ఏదో వచ్చింది చప్పున వెళ్ళి ఓ చేత్తో భార్య జుత్తు పట్టుకొని వూపివేస్తూ, రెండో చేత్తో గట్టిగా ఆమెను కొడుతూ, "చావండి! అందరూ చావండి... నీ కళ్ళు ఎందుకు కాలలేదు? చావు. నువ్వు, నేను అంతా చద్దాం" అన్నాడు, ఇంకా బాదుతూ. ఆమె దబ్బున కిందపడిపోయింది. పిల్ల ఆమె పక్కనే పడింది. ఇదిచూచి కొడుకు ఏడవడం మొదలు పెట్టేడు. ఇల్లంతా ఏడుపులు, గొల్లు, బొబ్బలతో నిండిపోయింది. వెంకయ్య ఎర్రటి నిప్పులాంటి కళ్ళతో వెర్రివాడిపలె చూస్తూ, అట్లా నిల్చుండి పోయాడు.

వీధిలో అందరూ వుత్సాహంతో బాణసంచా కాల్చుకుంటున్నారు.